సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 853 టన్నులు అమ్మకానికి వచ్చాయి.




టమాట కిలో రూ.12

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.6 పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం

41.8°/22.3°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.



న్యూస్‌రీల్

నేడు పుట్టపర్తికి ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్

పుట్టపర్తి అర్బన్: రెండురోజుల జిల్లా పర్యటనకు వచ్చిన ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం పుట్టపర్తిలో పర్యటించనున్నారు. ఉదయం హిందూపురం నుంచి గోరంట్ల మీదుగా పుట్టపర్తి చేరుకోనున్న ఆయన.. జగరాజుపల్లిలో కేజీబీవీని తనిఖీ చేస్తారని, అనంతరం సత్యసాయిబాబా మహా సమాధి దర్శించుకుంటారని అధికారులు తెలిపారు. అనంతరం పట్టణంలోని అన్ని వసతి గృహాలు, హాస్టళ్లు, చౌకదుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తారని వెల్లడించారు. అలాగే కొత్తచెరువు, కొడపగానిపల్లి గ్రామాల్లో పర్యటించి తిరిగి శాంతిభవన్‌కు విచ్చేస్తారని, మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ బసంత్‌కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తారని అధికారులు వెల్లడించారు.

భద్రత నడుమ ప్రశ్నపత్రాలు తరలించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

గాండ్లపెంట: పదో తరగతి ప్రశ్నపత్రాలను కట్టుదిట్టమైన భద్రత నడుమ సెంటర్లకు చేర్చాలని ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ పోలీసులను ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం పదో తరగతి పరీక్షల నిర్వహణ, ఏర్పాట్ల గురించి ఎస్ఐ మల్లికార్జున రెడ్డిని ఆరా తీశారు. కాగా, గత ఏడాది గాండ్లపెంట పరీక్షా కేంద్రం నుంచే పదో తరగతి పశ్నపత్రం లీక్ అయిన నేపథ్యంలో ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రశ్నాపత్రాల తరలింపుపై సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్పీ వెంట కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, రూరల్ సీఐ శివశంకర్‌నాయక్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం



కప్పలబండలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నరసింహులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి వైఎస్సార్ పింఛన కానుక పంపిణీ ప్రారంభమైంది. రెండు రోజులు బ్యాంకులకు సెలవులు రావడంతో ప్రభుత్వం సోమవారం సచివాలయ సిబ్బంది ఖాతాలలో డబ్బు జమ చేసింది. దీంతో సిబ్బంది బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసుకుని పంపిణీ ప్రారంభించారు. జిల్లాలో 2,64,128 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.73,33,11,000 నగదు జమ చేసింది.

అభివృద్ధిలో నూతన శకం

నూతన సంస్కరణలు, సేవల్లో పారదర్శకత, పాలనా సౌలభ్యానికి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నూతన జిల్లాల ఏర్పాటుతో సేవలన్నీ ప్రజల ముంగిటకు తెచ్చారు. ఈ క్రమంలోనే పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటుకాగా, అభివృద్ధి పరుగులు పెడుతోంది. సంక్షేమం ప్రతి ఇంటి తలుపుతడుతోంది.



జిల్లా కేంద్రం పుట్టపర్తి ముఖద్వారం



జిల్లా కలెక్టరేట్ భవనం



శ్రీసత్యసాయి జిల్లా మ్యాప్

శ్రీసత్యసాయి జిల్లాకు ఏడాది

- సంస్కరణలతో పాలన పరుగులు
- నూతనంగా మరో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు
- లేపాక్షి, ధర్మవరంలో కొత్త పోలీస్ స్టేషన్లు
- జిల్లా కేంద్రం చేరువ కావడంపై ప్రజల హర్షం

జిల్లా స్వరూపం ఇలా...

32	జిల్లాలోని మండలాల సంఖ్య
421	పంచాయతీల సంఖ్య
19 లక్షలు	జిల్లా జనాభా
04	రెవెన్యూ డివిజన్లు (పుట్టపర్తి, ధర్మవరం, పెనుకొండ, కదిరి)
05	పోలీస్ సబ్ డివిజన్లు (హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి)
51	పోలీస్, సెబ్ స్టేషన్ల సంఖ్య
06	మున్సిపాలిటీలు (మడకశిర, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి)

జిల్లా ఏర్పడ్డాక..

- పుట్టపర్తి రెవెన్యూ డివిజన్
- ధర్మవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్
- లేపాక్షి టూరిజం చెక్‌పోస్టు
- హిందూపురం పోలీస్ సబ్ డివిజన్
- పుడా పరిధి పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరణ
- ముదిగుబ్బ సర్కిల్ (పోలీస్)
- ధర్మవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

సాక్షి, పుట్టపర్తి: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్ విభజన శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే 2022 ఏప్రిల్ 4వ తేదీన శ్రీసత్యసాయి పేరుతో పుట్టపర్తి కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పటైంది. ఏడాది కాలంగా ప్రభుత్వ సేవలన్నీ స్థానికంగా అందుబాటులో ఉండటంతో కొత్త జిల్లా ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమీపంలోనే ఉండటంతో ప్రభుత్వ సేవలను సులువుగా పొందుతున్నారు.

'గడప గడపకు..'తో మరింత చేరువ..

జిల్లా వ్యాప్తంగా 420 గ్రామ, 124 వార్డు సచివాలయాలు కలిపి మొత్తం 544 ఉన్నాయి. సంక్షేమ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రజాప్రతినిధులే నేరుగా రంగంలోకి దిగారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' పేరుతో ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరు పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు 342 సచివాలయాలను సందర్శించారు. మొత్తం 6,09,316 గడపలకు గానూ 2,74,136 గడపలకు ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.

అభివృద్ధి పనుల్లో కొన్ని..

తాగునీటి వసతి, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, కమ్యూనిటీ భవనాలు, ప్రహరీల నిర్మాణం, కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులు పంచాయతీరాజ్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో ప్రాధాన్యత ఆధారంగా పనులు జరుగుతున్నాయి.

ప్రగతి పరుగులు..

'నాడు–నేడు'తో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారిపోయాయి. మెరుగైన సౌకర్యాలు, వసతులతో సేవలందిస్తున్నాయి. ఇక ప్రజల ముంగిటకే సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీలకు కొత్త భవనాలు సమకూరుతున్నాయి.

కష్టాలు తీరుస్తున్న 'స్పందన'

అన్ని మండల కేంద్రాలకు జిల్లా కేంద్రం పుట్టపర్తి అనుకూలంగా ఉండడం, కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో ఉన్నతాధికారులంతా అందుబాటులో ఉండడం వెరసి కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ క్రమంలోనే ఏడాదిలో 23,974 అర్జీలు స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై 9,697 అర్జీలు అందాయి. వీటిని వెంటనే ఆయా శాఖలకు పంపి పరిష్కరిస్తున్నారు.

కల నెరవేర్చాం



పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటు చేయాలని దశాబ్దాల క్రితమే ప్రతిపాదన తెచ్చారు. అయితే గత పాలకులు ఎవరూ సాకారం చేయలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా శ్రీసత్యసాయి పేరుతో జిల్లా ప్రకటించారు. జిల్లా ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ సేవలు, అధికారులు అందుబాటులో ఉండటంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. సేవలన్నీ ప్రజల ముంగిటకే వస్తున్నాయి.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

సత్యసాయి సేవలకు గుర్తింపు



భగవాన్ శ్రీసత్యసాయిబాబా పేరుతో పుట్టపర్తి కేంద్రంగా నూతన జిల్లాను ప్రకటించడం ఇక్కడి ప్రజల అదృష్టం. బాబా సేవలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. ప్రపంచంలోనే గుర్తింపు పొందిన ప్రశాంతి నిలయానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో సరైన గుర్తింపు లభించింది. ప్రభుత్వ సేవలకు శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది.

– ఆర్‌జే రత్నాకర్, సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ

సమర్థవంతమైన పాలన



కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వసతులు అందుబాటులోకి తెచ్చాం. సకాలంలో సిబ్బంది స్పందిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నారు. 'స్పందన'కు వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడు పరిష్కారం లభిస్తోంది.

– పట్నాల బసంత్‌కుమార్, కలెక్టర్

ఫిర్యాదు అందిన వెంటనే స్పందన



నూతన జిల్లా ఏర్పాటుతో జిల్లా కేంద్రానికి దూరం తగ్గింది. దీంతో ఫిర్యాదు అందిన వెంటనే సిబ్బంది స్పందిస్తున్నారు. ఏడాది వ్యవధిలో పోలీసు వ్యవస్థ చాలా విజయాలు సాధించింది. ధర్మవరం టూ టౌన్, ట్రాఫిక్ స్టేషన్‌లతో పాటు లేపాక్షి చెక్‌పోస్టు ఏర్పాటు చేశాం. కదిరి, పుట్టపర్తిలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ప్రతిపాదనలు పంపించాం.

– రాహుల్‌దేవ్‌సింగ్, ఎస్పీ

గడువులోపు అర్జీలన్నీ పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో అందే అర్జీలన్నీ నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'స్పందన'లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 121 అర్జీలు అందించగా, కలెక్టర్ వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 'స్పందన'లో అందే ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్ అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత వరకూ క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే సమస్య పరిష్కారం సులువు అవుతుందన్నారు.

గ్రౌండింగ్ వేగవంతం చేయాలి..

'స్పందన' కార్యక్రమం అనంతరం కలెక్టర్ డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో గుర్తించిన 1,452 పనులకు గాను 1,236 పనులు మంజూరయ్యాయన్నారు. ఇందులో 113 పనులు గ్రౌండింగ్ చేశారని, తక్కిన 123 పనులను త్వరిత గతిన గ్రౌండింగ్ చేయాలన్నారు. డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీల్లో కొన్ని...

తనకు 11 ఏళ్ల వయస్సులో విద్యుదాఘాతం జరగ్గా రెండు చేతులూ దెబ్బతిన్నాయని, అయినా పట్టుదలతో డిగ్రీ చదివి డీఎడ్ కూడా పూర్తి చేశానని ధర్మవరానికి చెందిన వెంకటరాముడు కుమార్తె ఊర్మిళ తెలిపారు. తనకు ఏ ప్రభుత్వ శాఖలోనూ ఉద్యోగం ఇవ్వడంలేదని, ఏ ఆధారం లేని తనకు ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

- తనకు చిన్న తనం నుండే రెండు చేతులు లేవని, అయినా అధికారులు రూ.3 వేల పింఛనే ఇస్తున్నారని, ఆ మొత్తం వైద్యం ఖర్చులకే చాలలేదని కదిరి బాబాకాలనీకి చెందిన నాగప్ప భార్య వెంకటలక్ష్మి కలెక్టర్‌కు విన్నవించారు. వంద శాతం వికలత్వం ఉన్న తనకు రూ.5 వేల పింఛన్ అందించి ఆదుకోవాలని కోరారు.
- పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద సర్వే నంబర్ 173–3లో కొందరు ప్లాట్లు వేయగా, 40 మంది మి వాటిని కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టామని పైపల్లి గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. అయితే ఇటీవల ముదిగుబ్బ–కోడూరు వరకూ నేషనల్ హైవే–342 తమ ప్లాట్లలో వెళ్తోందని, అక్కడ ప్లాట్లు కొన్నవారంతా పేదలేనని, అందువల్ల తమ ప్లాట్లలో జాతీయ రహదారి వెళ్లకుండా చూడాలని, లేకపోతే మెరుగైన పరిహారం అందించాలని కోరారు.

జెడ్పీ డిప్యూటీ సీఈఓగా అమృతరాజు



అమృతరాజు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయ గణాంకాధికారి ఎండీ అమృతరాజును డిప్యూటీ సీఈఓగా నియమిస్తూ అనంతపురం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం ఉదయం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇప్పటి వరకూ ఆ హోదాలో పనిచేసిన జిల్ల శ్రీనివాసులు మంగళవారం రిలీవ్ కానున్నారు. కాగా, పనితీరులో నిబద్ధత కలిగిన అమృతరాజ్.. కర్నూలు జిల్లా వాసి. 2007లో గ్రూప్–1 ఆఫీసర్‌గా నియమితులయ్యారు. కర్నూలు జిల్లా పెద్దకడబూరు ఎంపీడీఓగా తొలి పోస్టింగ్ అందుకున్నారు. ఆ తర్వాత డోన్, ప్యాపిలి, పెనుకొండ, నార్పల, రామగిరి, గుత్తి, ఉరవకొండ మండలాల ఎంపీడీఓగా పనిచేశారు. విధుల నిర్వహణలో ఆయన కనబరిచిన చిత్తశుద్ధికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో తొమ్మిది పురస్కారాలు దక్కాయి. ప్యాపిలిలోని బాలికల ఉన్నత పాఠశాలను దత్తత తీసుకుని మోడల్‌గా తీర్చిదిద్దారు. నార్పలలో పనిచేసిన సమయంలో ఉపాధి పనుల కల్పనలోనూ మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. త్వరలో డిప్యూటీ సీఈఓగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

పిల్లల పొట్టకొట్టొద్దు!



పరిగి: మోదా జెడ్పీహెచ్‌ఎస్‌లో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్



అంగన్‌వాడి కేంద్రంలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

- చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం
- తప్పు జరిగితే ఎవరినీ ఉపేక్షించం
- రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

లేపాక్షి/పరిగి: "రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో, అంగన్‌వాడీ సెంటర్లలోనూ నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన చిన్నారులే చదువుకుంటూ ఉంటారు. డబ్బుల కోసం కక్కుర్తి పడి వారి కడుపుకొట్టాలని చూస్తే సహించేది లేదు. మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సిందే. ఎక్కడైనా అక్రమాలు జరిగితే కఠినంగా వ్యవహరిస్తాం" అని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా పర్యటనలో ఉన్న ఆయన సోమవారం లేపాక్షి, పరిగి మండలాల్లో పర్యటించారు. తొలుత లేపాక్షిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంతో పాటు ప్రాథమి పాఠశాల, అంగన్‌వాడి కేంద్రాన్ని, రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. కస్తూర్బా విద్యాలయలోని విద్యార్థినులతో మాట్లాడారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులు, ఎఫ్‌పీ షాపులో సరుకుల నిల్వలు, అంగన్‌వాడి కేంద్రంలో రిజిష్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పరిగి మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం స్వయంగా తిని చూశారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై మెనూ గురించి చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఆహార భద్రతకు పెద్ద పీట వేసిందని, ముఖ్యంగా విద్యార్థులు తినే ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీకుమారి, తహసీల్దార్లు సౌజన్యలక్ష్మీ, బాబు, ఎంపీడీఓ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 99 శాతం మంది విద్యార్థుల హాజరు



పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్



పుట్టపర్తి: పరీక్ష కేంద్రంలో విద్యార్థుల హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జిల్లావ్యాప్తంగా 125 కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు పరీక్షకు 23,128 మంది విద్యార్థులకు గాను, 22,913 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 215 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో హాజరు శాతం 99 శాతం నమోదైంది. దాదాపు అన్ని కేంద్రాల్లోని తాగునీరు, ఫర్నీచర్ తదితర మౌలిక వసతులు కల్పించారు. ఆర్టీసీ ఉచితంగా ప్రత్యేక సర్వీసులు నడపడంతో విద్యార్థులకు అరగంట ముందుగానే కేంద్రాలకు చేరుకోగలిగారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్..

పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన పుట్టపర్తిలోని చిన్నపల్లి ఉన్నత పాఠశాల, ఎనుములపల్లి ఉన్నత పాఠశాల, వారధి ప్రైవేటు పాఠశాల, ఎస్ఎస్ఎస్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి గదికి వెళ్లి సౌకర్యాలు ఆరా తీశారు. కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య శాఖ ఏర్పాటు చేసిన మందులను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఎంఈఓ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు.

ఎంఈఓకు షోకాజ్ నోటీస్

పదో తరగతి పరీక్షల నిర్వహణలో అలసత్వం వహించిన పుట్టపర్తి ఎంఈఓ వెంకట రమణ నాయక్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి తెలిపారు. కలెక్టర్ బసంత్‌కుమార్ సోమవారం పుట్టపర్తి ఉన్నత పాఠశాల కేంద్రాన్ని తనిఖీ చేశారని, అక్కడ మౌలిక వసతులు సరిగా లేకపోవడంతో పాటు వెలుతురు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడిన విషయాన్ని కలెక్టర్ గమనించారన్నారు. దీంతో పుట్టపర్తి ఎంఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని విద్యా శాఖకు ఆదేశాలు అందడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నామన్నారు.



నేతాజీ స్కూల్ కేంద్రంలో సహాయకురాలితో పరీక్ష రాయిస్తున్న ముఖేష్



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ముఖేష్ (ఫైల్)

'పది'ంతల సంకల్పం

హిందూపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థి పట్టుదలతో పదో తరగతి పరీక్షలు రాశారు. స్క్రైబ్ (సహాయకుడి) సాయంతో పరీక్ష రాసి తన సంకల్పం ఏమిటో చాటాడు. వివరాల్లోకి వెళితే.. ముద్దిరెడ్డిపల్లి జెడ్పీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ముఖేష్ వారం రోజుల క్రితం బైక్‌పై వెళ్తూ కిందపడిపోయాడు. దీంతో ముఖానికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స చేసిన వైద్యులు... ఒత్తిడికి లోనుకాకూడదని తెలిపారు. తాను పదో తరగతి పరీక్షలు రాయాల్సి ఉందని చెప్పగా, ఆరోగ్యం కుదుట పడ్డాక మరో ఏడాది పరీక్షలు రాసుకోవాలని, అంతవరకూ విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు. అయితే ముఖేష్ మాత్రం ఏడాది కష్టం వ్యర్థం కాకూడదని భావించాడు. తన స్కూల్‌లోనే తొమ్మిదో తరగతి చదువుతున్న సాయిప్రసన్నను స్క్రైబ్‌గా నియమించుకుని ముఖానికి కున్న కట్లుతోనే పరీక్షలకు హాజరయ్యాడు. ముఖేష్ పట్టుదల చూసి ఉపాధ్యాయులు అతన్ని అభినందించారు.

మారిన ప్రశ్నపత్రం!

రాప్తాడురూరల్: పదో తరగతి పరీక్షల్లో అధికారులు ప్రశ్నపత్రం మార్చేశారు. అనంతపురంలోని భాష్యం పాఠశాల కేంద్రంలో ఇడిగొట్టు నందిని అనే విద్యార్థినికి, సీవీఆర్ స్కూల్ కేంద్రంలో పోలేపల్లి జశ్వంత్ అనే విద్యార్థికి తెలుగు ప్రశ్నపత్రం బదులుగా తెలుగు కాంపొజిట్ ప్రశ్నపత్రం ఇచ్చారు. పరీక్ష అనంతరం ఇళ్లకు వెళ్లి విషయం చెప్పడంతో సదరు విద్యార్థులతో పాటు కుటుంబ సభ్యులు డీఈఓ సాయిరామ్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామని డీఈఓ హామీ ఇచ్చారు. అనంతరం విచారణ జరిపి భాష్యం స్కూల్‌లో ఇన్విజిలేటర్ హెచ్.నాగవేణి, సీవీఆర్ స్కూల్ కేంద్రంలో ఇన్విజిలేటర్ పీవీ నాగభూషణను సస్పెండ్ చేశారు.

క్లుప్తంగా

కుందనకోట కొండల్లో కుళ్లిన మృతదేహం

యాడికి: మండలంలోని కుందనకోట కొండల్లో పూర్తిగా కుళ్లిపోయిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. కుందనకోట సమీపంలోని మద్దిలేటయ్య స్వామి గుడి కొండ ప్రాంతంలో సోమవారం ఉదయం గొర్రెల కాపరులు... మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన స్థితిని బట్టి 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న పురుషుడు దాదాపు పది రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని అంచనా వేశారు. నలుపు రంగు గీతలున్న నీలం రంగు ఫుల్ షర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్, బెల్ట్ ధరించాడు. గ్రామ వీఆర్వో కుళ్లాయప్ప ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు.

యానిమేటర్ చేతివాటం

ఉరవకొండ: స్త్రీనిధి సొమ్మును దోచుకున్న టీడీపీ మహిళా కార్యకర్తపై తక్షణ చర్యలు తీసుకోవాలంటూ మహిళా సంఘాల ప్రతినిధులు సోమవారం ఉరవకొండ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. యానిమేటర్‌గా పనిచేస్తున్న ఉరవకొండకు చెందిన టీడీపీ కార్యకర్త రషీదా.. తమను మోసం చేసిందని వాపోయారు. 2016 నుంచి స్త్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నా... ఆ డబ్బును వీఓకు చెల్లించకుండా రషీదా స్వాహా చేసిందన్నారు. ఈ లెక్కన దాదాపు రూ.2 లక్షల వరకు డబ్బు స్వాహా చేసిందని ఆరోపించారు. స్త్రీనిధి డబ్బు చెల్లించకపోవడం వల్ల తమకు పథకాలు అందకుండా పోయాయని, తమకు న్యాయం చేయాలంటూ ఎంపీడీఓ గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు.

ఐపీఎల్ హోరు.. బెట్టింగ్ జోరు

- హిందూపురానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ మార్చి 31న జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ గెలుస్తుందని రూ.లక్ష పందెం కాశాడు. అయితే గుజరాత్ టైటాన్స్ జట్టు గెలవడంతో అతని డబ్బు పోయింది. ఈ విషయం తెలిసి ఇంట్లో భార్య గొడవ చేయడంతో మనస్తాపానికి గురైన ఆ యువకుడు అదే రోజు రాత్రి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయాన్ని గమనించిన భార్య వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించడంతో ప్రాణాపాయం తప్పింది.
- ఈ నెల 1న పంజాబ్ కింగ్స్‌–కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు గెలుస్తుందని కదిరి పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బెట్టింగ్ వేశాడు. ఆ రోజు పంజాబ్ జట్టు గెలవడంతో సదరు టీచర్ రూ.3 లక్షల బెట్టింగ్‌ను వడ్డీ వ్యాపారికి చెల్లించాల్సి వచ్చింది. ఈ చెల్లింపు వ్యవహారంలో ఇరువురి మధ్య గొడవ చోటు చేసుకోవడంత పెద్ద మనుషులు జోక్యం చేసుకుని రూ.1.50 లక్షలు చెల్లించేలా సమస్య పరిష్కరించారు.

జిల్లాను ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) బెట్టింగ్ ఫీవర్ పీడిస్తోంది. మారుమూల గ్రామాలు మొదలు పట్టణాల వరకూ క్రికెట్ పందేలు జోరుగా నడుస్తున్నాయి. ఈజీ మనీ ఆశ చూపి రూ.కోట్లు కొల్లగొట్టే బుకీల ఎత్తుగడకు యువత చిత్తవుతోంది.

- నిత్యం రూ.కోట్లలో లావాదేవీలు
- పెద్ద మొత్తంలో నష్టపోతున్న యువత

కదిరి: క్రికెట్‌పై ప్రజలకున్న ఆసక్తిని కొందరు బెట్టింగ్‌ల రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు



ఐపీఎల్‌ను వేదికగా మార్చుకున్నారు. వీరి మాయలో చిక్కుకున్న ఆటో డ్రైవర్లు, దినసరి కూలీలు సైతం రోజువారీ సంపాదనను బెట్టింగ్ రూపంలో నష్టపోతున్నారు. పోయిన డబ్బును తిరిగి సంపాదించాలనే కసితో అధిక వడ్డీలకు అప్పు చేసి మళ్లీ బెట్టింగ్ వేస్తున్నారు. చివరకు ఆస్తులను తాకట్టు పెట్టే స్థితికి దిగజారుతున్నారు. సోమవారం బెంగుళూరులో జరిగిన మ్యాచ్‌లో ఎక్కువ మంది ముంబయి జట్టు గెలుస్తుందని బెట్టింగ్ వేసి పెద్ద మొత్తంలో నష్టపోయిన అంశం స్థానికంగా చర్చానీయాంశమైంది.

ఆన్‌లైన్.. ఆఫ్‌లైన్ పేరుతో..

క్రికెట్ బెట్టింగ్ కోసం బుకీలు ప్రత్యేక యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. చాలా వరకూ ఈ యాప్‌లు హిడెన్ మోడ్‌లోనే పని చేస్తుంటాయి. ఈ యాప్‌ల ద్వారా రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ డిపాజిట్ చేసే వెసులుబాటు ఉంది. డబ్బు అయిపోగానే మళ్లీ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. జట్ల గెలుపు, ఓటములతో పాటు బంతి బంతికీ బెట్టింగ్ నిర్వహిస్తుంటారు. ఈ ఓవర్‌లో బ్యాటర్ ఎంత స్కోర్ చేస్తాడు? ఈ ఓవర్‌లో వికెట్ పడుతుందా? ఏ బ్యాటర్ సెంచరీ చేస్తాడా? ఏ బౌలర్ ఎక్కువ వికెట్లు తీస్తాడు? మొత్తం స్కోర్ ఎంత చేయగలుగుతారు? ఆటగాడు ఎన్ని సిక్స్‌లు కొడతాడు? ఇలా ఆట ముగిసే వరకూ పలు రకాలుగా బెట్టింగ్‌లు సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఫేవర్, అన్ ఫేవర్ అనే రెండు ఆప్షన్లు ఉంటాయి. ఫేవర్ అంటే పందెం వేసిన వ్యక్తి చెప్పినట్లు జరిగితే మూడు రెట్లు చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయి. ఆఫ్‌లైన్ ద్వారా అయితే సొమ్మును నేరుగా కొందరు ఏజెంట్లకు చెల్లించి బెట్టింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. గెలిచే జట్టును ఫ్లెయింగ్ అని, ఓడిన జట్టును ఈటింగ్ అని, రూ.1000ని ఫింగర్ అని, రూ.10వేలును బోన్ అని, రూ.1లక్షను లెగ్ అని పిలుస్తుంటారు.

అన్ని ప్రధాన పట్టణాల్లో ఏజెంట్లు..

జిల్లాలోని కదిరి, ధర్మవరం, హిందూపురం, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, గోరంట్ల, కొత్తచెరువు, బత్తలపల్లి తదితర ప్రధాన పట్టణాల్లో ఐపీఎల్ క్రికెట్‌పై బెట్టింగ్ కోసం బుకీలు స్థానికంగా కొందరు నమ్మకస్తులను ఏజెంట్లుగా నియమించుకున్నారు. వీరు రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకూ డిపాజిట్‌లు ముందే కట్టించుకుని బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. డిపాజిట్ సొమ్ము అయిపోతే మళ్లీ డిపాజిట్ చేయించుకుంటారు. ఈ క్రమంలో రోజూ తమ స్థావరాలను, సెల్‌నెంబర్లను ఏజెంట్లు మార్చేస్తూ పోలీసుల కళ్లు కప్పేస్తున్నారు. ఏ రోజుకారోజు కొత్త నంబర్ బెట్టింగ్ రాయుళ్లకు మాత్రమే తెలుస్తుంది. ఆట మొదలైన వెంటనే పందెం రాయుళ్ల సెల్‌ఫోన్లను ఏజెంట్ల స్వాధీనం చేసుకుని, ముగిసిన తర్వాత తిరిగి ఇచ్చేస్తారు. ఈ క్రమంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా రోజుకు రూ.3 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకూ చేతులు మారుతున్నట్లు సమాచారం. వారాంతంలో రెండేసి మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్ సొమ్ము రెట్టింపులో ఉంటోంది.

నిఘా ఏర్పాటు చేస్తాం



క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను పట్టుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. పాత నేరస్తులపై నిఘా ఉంచాం. లాడ్జీలు, హోటళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తాం. ఎక్కడా బెట్టింగ్ జరగకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

– రాహుల్‌దేవ్ సింగ్, ఎస్పీ

టీడీపీ నేతలు అన్యాయం చేశారు... ఆదుకోండి

- రైతు దంపతుల వేడుకోలు



నిరాహార దీక్షకు కూర్చొన్న రైతు దంపతులు

పుట్టపర్తి అర్బన్: టీడీపీ ప్రభుత్వ హయాంలో స్వాధీనం చేసుకున్న భూమికి సంబంధించి పరిహారాన్ని ఆ పార్టీ నేతలు స్వాహా చేశారని, ఇప్పటికైనా తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ నల్లచెరువు మండలం తలమర్లవాండ్లపల్లికి చెందిన రైతు దంపతులు గుత్తా లక్ష్మీనారాయణ, లీలావతి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ బసంత్‌కుమార్ ద్వారా ప్రభుత్వానికి వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు తమకు జరిగిన అన్యాయంపై కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు తలమర్లవాండ్లపల్లిలో సర్వే నంబర్లు 297–2, 298–1, 298–3, 299–2, 299–5, 299–6లో 4.7 ఎకరాల భూమి ఉండేదన్నారు. చెన్నై హైవే నిర్మాణంలో భాగంగా దాదాపు ఎకరా భూమిని అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించి 2015లో నోటిఫికేషన్ ఇచ్చి 2016లో రోడ్డు కూడా వేశారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ తమకు పరిహారం చెల్లించలేదని, ఈ విషయంగా విచారణ చేస్తే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తమ ఖాతాలకు పరిహారం సొమ్ము మళ్లించుకున్నట్లు వెలుగు చూసిందని వివరించారు. తమకు సీఎం వైఎస్ జగనన్న ఒక్కరే న్యాయం చేయగలరని, ఈ మేరకు తమ డిమాండ్‌ను సీఎం దృష్టికి తీసుకెళ్లాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వివాహిత ఆత్మహత్య

కంబదూరు: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... తిమ్మా పురం గ్రామానికి చెందిన చాకలి మధు, మౌనిక (22) దంపతులకు ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న మౌనికకు కుటుంబసభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నారు. సోమవారం కడుపునొప్పి తీవ్ర కావడంతో భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాజేష్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు

- ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్‌కు విన్నవించిన బాధితురాలు



వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

కొత్తచెరువు: అదనపు కట్నం కోసం తనను భర్త, అత్తామామలు వేధిస్తున్నారని, వారి బారి నుంచి తనకు రక్షణ కల్పించాలంటూ ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్‌ను ఓ వివాహిత వేడుకుంది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీని కలసి వినతి పత్రం అందజేసి, తన గోడు వెల్లబోసుకుంది. బాధితురాలు తెలిపిన మేరకు... సోమందేపల్లికి చెందిన హరీష్‌తో నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శిల్పతో వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. పెళ్లైన ఏడాది తర్వాత అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తమామలు ఆదెమ్మ, గంగరాజు వేధించసాగారు. వారి డిమాండ్ నెరవేర్చలేదన్న అక్కసుతో భర్తకు అత్తమామలు చాడీలు చెప్పి తనపై అనుమానాలు రేకెత్తేలా చేశారు. దీంతో ఏడాది క్రితం భర్త వదిలేయడంతో తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. అయినా అదనపు కట్నం కోసం వారు వేధింపులు కొనసాగిస్తూనే ఉన్నారు. వారి బారి నుంచి తనకు రక్షణ కల్పించాలంటూ ఎస్పీకి బాధితురాలు విన్నవించింది. కాగా, పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 41 వినతులు అందాయి. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం సోమవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కేవీ రామకృష్ణప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొన్న అతి వేగం



నుజ్జునుజ్జైన కారు, ద్విచక్ర వాహనం





వంశీ (ఫైల్) , గాయపడిన మల్లికార్జున

విడపనకల్లు: అతి వేగం ఓ విద్యార్థి ప్రాణాలను బలిగొంది. మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన వంశీ, మల్లికార్జున ఇద్దరూ పదో తరగతి కంపార్ట్‌మెంట్ పరీక్షలు రాస్తున్నారు. ఈ నెల 10, 13 తేదీల్లో వీరు పరీక్ష రాయాల్సి ఉంది. ఈ క్రమంలో తమకు కేటాయించిన పరీక్ష సెంటర్‌ను చూసేందుకు సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై విడపనకల్లులోని ఆదర్శ పాఠశాలకు బయలుదేరారు. వేగంగా దూసుకెళుతున్న విద్యార్థులు విడపనకల్లు – ఆదర్శ పాఠశాల మధ్యకు చేరుకోగానే ఎదురుగా అంతే వేగంతో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి వచ్చిన కారును ఢీకొన్నారు. ఘటనలో రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. తలకు బలమైన గాయం కావడంతో వంశీ కోమాలోకి వెళ్లాడు. మల్లికార్జునకు కుడికాలు విరిగింది. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వంశీని బెంగళూరుకు, మల్లికార్జునను తిరుపతికి తరలించారు. కాగా, బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్సకు స్పందించక వంశీ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఘటనపై విడపనకల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వైభవం... మహాలక్ష్మీ రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల: మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో గంగా సోమవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం ఉత్సవ మూర్తికి ప్రత్యేక పూజలు చేసి, ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై అధిష్టింపజేశారు. ఉత్సవానికి హాజరైన వేలాది భక్తులు అమ్మవారి నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. గ్రామానికి చెందిన రాజ వంశీకుడు రంగప్పరాజు (దొర) నేతృత్వంలో అమ్మవారికి బ్రాహ్మణ ముత్తైదవులు జ్యోతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనంతరాజు, ఎంపీపీ కవిత, సర్పంచ్ చిన్నరంగప్ప, ఎంపీటీసీ సభ్యుడు జగదీష్‌బాబు, దేవదాయశాఖ ఈఓ నాగేంద్రప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా, మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గంగా పూజ నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీదేవి మూలవిరాట్



ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పంటనష్టం అంచనా



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లిలో రైతు కొల్లప్ప పంట పొలాన్ని సోమవారం పట్టు పరిశ్రమశాఖ జేడీ పద్మమ్మ, ఏడీ నరసింహులు పరిశీలించారు. రాజకీయ కక్షతో కొల్లప్ప పంటపై టీడీపీ నేతలు విషప్రయోగం చేసిన వైనంపై 'టీడీపీ వర్గీయుల దాష్టీకం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు ఉదయం ఆ గ్రామానికి చేరుకుని బాధిత రైతుతో కలసి పంట పొలాన్ని పరిశీలించారు. జరిగిన నష్టంపై అంచనా వేసి నివేదిక సిద్ధం చేసి, కలెక్టర్‌కు అందజేయనున్నట్లు ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. కాగా, పంటపై విషప్రయోగం చేశారన్న విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రమేష్, సింగల్‌విండో అధ్యక్షుడు ముత్యాలు, సర్పంచ్ సిద్దన్న, నాయకులు దాసరి మోహన్, బండారు అనిల్, నర్సిరెడ్డి తదితరులు సోమవారం బాధిత రైతు కొల్లప్పను పరామర్శించారు. అధైర్య పడకూడదని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు.

ఏపీఆర్‌ఎస్ పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న గురుకుల పాఠశాలల రాష్ట్ర సెక్రటరీ కృష్ణమోహన్

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాం, నసనకోట లోని ఏపీఆర్‌ఎస్ పాఠశాలలను మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను, పరిసరాలను, పలు రికార్డులను పరిశీలించారు. భోజనంలో నాణ్యత, మౌలిక వసతుల కల్పనపై విద్యార్థులతో ఆరా తీశారు. పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదు కావాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్స్‌పాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతలోకి నారా లోకేష్ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్

అనంతపురం/బత్తలపల్లి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర అనంతపురం జిల్లాలోకి అడుగుపెట్టింది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో మూడు రోజుల పాటు కొనసాగిన పాదయాత్ర సోమవారం అనంతపురం రూరల్ మండలం మన్నీల వద్ద అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. లోకేష్ బత్తలపల్లి మండలంలోని ఈదుల ముష్టూరు క్రాస్ నుంచి సంజీవపురం, యర్రాయపల్లి క్రాస్ మీదుగా మన్నీల క్రాస్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈదుల ముష్టూరు క్రాస్‌లో రైతు ప్రతినిధులతో సమావేశం, సంజీవపురంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో భేటీ, యర్రాయపల్లి క్రాస్ వద్ద స్థానికులతో మాటామంతీ ఉండాలి. కానీ ఇవేమీ లేకుండానే ముందుకు సాగారు. ఎస్కే యూనివర్సిటీ వద్ద ఏఐఎస్‌ఎఫ్ నాయకుల నుంచి వినతిపత్రం తీసుకున్నారు. పంగల్‌రోడ్డు వద్దకు చేరుకుని అక్కడ రాత్రి బస చేశారు. ఇదిలా ఉండగా.. పాదయాత్ర ప్రారంభం దగ్గర (ఈదుల ముష్టూరు క్రాస్) కార్యకర్తలతో సెల్ఫీల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దానిని కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులను పాదయాత్ర వలంటీర్లు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. దీంతో టీడీపీ నాయకులు కలుగజేసుకుని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు.

హిజ్రాల అర్ధనగ్న ప్రదర్శన



ఆందోళన నిర్వహిస్తున్న హిజ్రాలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం హిజ్రాలు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అలాగే తమ సమస్యలపై స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ గాయత్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాయలసీమ హిజ్రాల సంఘం అధ్యక్షురాలు హాసినీ మాట్లాడుతూ నకిలీ హిజ్రా ఆసిఫ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్‌లోని చాలా మందిని ఒంటరి చేస్తూ.. వారిపై దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాడన్నారు. భిక్షాటన ద్వారా వచ్చిన డబ్బును కూడా లాగేసుకుంటున్నాడని వాపోయారు. హిజ్రాలను డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస చేసి.. వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని చెప్పారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.